నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
ఎన్టీఆర్ కృష్ణా
శనివారం 18 అక్టోబర్ 2025 పేజీలు 8






ఎన్.డి.బి రహదారులను త్వరితగతిన పూర్తి చేయడంపై

# దృష్టిసారించాలి

- కాంట్రాక్టర్లకు త్వరితగతిన బిల్లులు చెల్లించే ప్రయత్నం చేస్తాం
- మార్చి 2026 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపిన ఎన్.డి.బి కాంట్రాక్టర్లు
- రాష్ట్రంలో తీవ్రంగా దెబ్బతిన్న రహదారులను తొలి ప్రాధాన్యతగా అభివృద్ధి చేయాలి
- ఆర్ & బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్షా

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిలో ధీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు తొలి ప్రాధాన్యత కల్పించడం ద్వారా ప్రజలకు మెరుగైన సమర్థవంతమైన రహదారులను కల్పించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. ప్రజలకు గుంతల – గోతుల రహిత రహదారుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు.. నేడు విజయవాడలోని ఈఎన్సీ కార్యాలయంలో ఎన్.డి.బి పనులపై ఆర్ & బీ శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎం.టీ 2

# ఆత్మనూన్యతను భావాన్ని విడనాడండి



- ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలి
- ప్రతిబంధకాలను అధిగమించినప్పుడే ఆశించిన స్థాయికి ఎదుగుతాం
- ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉన్నత శిఖరానికి చేరండి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులు ఆత్మనూన్యత భావాన్ని విడనాడి, జీవిత లక్ష్యాన్ని నిర్ధేశించుకుని, ప్రతిబంధకాలను అధిగమించి ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో ఉత్తమ విద్యను అభ్యశించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ విద్యార్థులకు సూచించారు. సంక్షేమ వసతి గృహాల నిర్వహణ

మిగతా 2లో

# సాక్షాత్తు సుప్రీంకోర్టు సీజేపైనే దాడా?



- మరి సామాన్యులకు రక్షణ ఎక్కడా?
- దాడి చేసిన వారిపై ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం దారుణం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ

జగ్గయ్యపేట, అక్టోబర్ 17, మేజర్ న్యూస్: సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గవాయి పై జరిగిన దాడి ఒక వ్యక్తి పైన, సమాజం పైన చేసిన దాడి కాదని ఈ దేశంలో గల కోట్లాదిమంది దళిత వర్గం, వారి ఆత్మ గౌరవం, రాజ్యాంగంపై జరిగిన దాడిని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ అన్నారు. పట్టణంలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గావాయిపై జరిగిన దాడి పై నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ పాల్గొన్నారు. మొదట బస్టాండ్ సమీపంలో గల మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ సిజెఐపై జరిగిన దాడిని యావత్తు దేశంలోని అధికారపక్ష, ప్రతిపక్ష, వామపక్ష పార్టీలు సైతం వ్యతిరేకించాయని, 2లో

# ప్రజలకు కూటమి ప్రభుత్వం సూపర్ గిఫ్ట్



- పేద, మధ్యతరగతి ప్రజలకు వరంలా జీఎస్టీ సేవింగ్స్
- జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి
- క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోంది
- ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 45వ డివిజన్ జిల్లా కోర్టు సెంటర్ నుండి ఇండోర్ స్టేడియం వరకు జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కలిగించేలా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ జండా ఊపి ర్యాలీ నిర్వహించి, అనంతరం ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్పోర్ట్స్‌కు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ క్రీడాకారులకు మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)



## సాక్షాత్తు సుప్రీంకోర్టు సీజేపైనే దాడా?

దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీలు సైతం ఈ దాడిని ఖండించారు అన్నారు. దాడి చేసిన న్యాయవాదిపై ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం, అరెస్టు చేయకపోవడం దారుణం అన్నారు. సాక్షాత్తు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి చేయడం అంటే సామాన్యులకు ఎక్కడ రక్షణ ఉందని ప్రశ్నించారు. ఈ దాడి వ్యక్తిగతంగా జరిగిందా లేక ఈ దాడి వెనుక ఎవరైనా హస్తం ఉందా అనేది నిగ్గు తేల్చాలని, దేశంలో తప్పు చేసిన వారిని దండించే అధికారం కోర్టులకు ఉందని అన్నారు. ఈ దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టటం జరుగుతుందని త్వరలో చలో హైదరాబాద్, చలో అమరావతి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తక్షణమే సిజెఐపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని లేకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి తాసిల్దార్ మనోహర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు పేరెల్లి ఎలీషా రావు మాదిగ, కోటా దానియేలు మాదిగ, చింతిరాల గోపి మాదిగ, మాతంగి దావీదు మాదిగ, అన్నేపాక కాంతారావు మాదిగ, న్యాయవాదులు ఎం నాగేశ్వరరావు, మాతంగి భాస్కరరావు, బూడిద నరసింహారావు, బెజవాడ బిక్షమయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్.డి.బి రహదారులను త్వరితగతిన పూర్తి చేయడంపై దృష్టిసారించాలి





(మొదటిపేజీ తరువాయి)

కృష్ణబాబుతో కలిసి మంత్రి సమీక్షించారు.. ఈ సందర్భంగా ఎన్.డి.బి పనుల స్థితి గతులపై ఆర్ & బీ శాఖ అధికారులు, ఎన్.డి.బి కాంట్రాక్టర్ లతో స్వయంగా మంత్రి మాట్లాడారు.. ఎన్.డి.బి పనుల జాప్యం కావడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు.. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు త్వరతగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని, కాబట్టి మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని వారిని కోరారు. అదే సమయంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడవద్దన్నారు. ఎన్.డి.బి ప్రాజెక్టు కింద తగ్గించిన పనులకు సంబంధించి కొత్త అంచనా వ్యయంతో కూడిన నివేదికను 15 రోజుల్లో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.. అదే క్రమంలో కాంట్రాక్టర్లకు సంబంధించి బ్యాంకు గ్యారంటీ విషయంలో వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.. ఎన్.డి.బి రహదారులను కుదించే క్రమంలో వంతెనలు, కల్వర్టులు మినహాయించి, కేవలం రహదారుల నిర్మాణం చేపట్టి, యాక్సిడెంట్ లకు ఆస్కారం కల్పించే పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన ఎన్.డి.బి రోడ్ల పనులను మా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పట్టాలెక్కించి, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు దాదాపు రూ.239 కోట్ల మేర బిల్లులు చెల్లించామన్నారు.. అయితే అనంతరం అనివార్య కారణాలతో పనుల్లో వేగం పుంజుకోలేదని తెలిపారు. ఎన్.డి.బి రహదారుల పనులకు సంబంధించి రూ. 1680.97 కోట్లతో 85 ఎన్.డి.బి రోడ్ల పనులను 682 కి.మీ కు కుదించడం జరిగింది.. అనంతరం కాంట్రాక్టర్ లతో మాట్లాడి నిలిచిన పనులను తిరిగి పట్టాలెక్కించడం జరిగింది.. ఇందులో ఇప్పటికే 546 కి.మీ మేర పనులు ప్రారంభించగా, 236 కి.మీ మేర పనులు పూర్తి చేయడం జరిగింది. ఇప్పటికే రూ. 932.99 కోట్ల మేర పనులు పూర్తి చేయడం జరిగింది. ఫేజ్ 1 కింద ఇప్పటి వరకు ఇప్పటి వరకు దాదాపు 747.98 కోట్ల పనులు పూర్తి చేసి, రూ. 434 కోట్ల మేర నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించడం జరిగింది. రూ. 161 కోట్ల బిల్లులు సిఎఫ్ఎంఎస్ కింద ఇప్పటికే అప్ లోడ్ చేయడం జరిగింది.. మరో దాదాపు 151 కోట్ల మేర బిల్లులు ఇంకా అప్ లోడ్ చేయాల్సి ఉంది. మొత్తంగా ఇప్పటి వరకు 44.49 % మేర పనులు పూర్తి చేశామన్నారు. అయితే దాదాపు 6 జిల్లాల్లో 50 శాతం కంటే తక్కువ పనులు మాత్రమే జరిగిన క్రమంలో ఆయా జిల్లాల్లో అధికారులు పనులు వేగం పెంచేందుకు మరింత దృష్టిసారించాలి. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. మార్చి 2026 లోపు ఎన్.డి.బి పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.. అదే సమయంలో తమ పెండింగ్ బిల్లులు త్వరితగతిన అందజేయాలని మంత్రికి విన్నవించారు. త్వరలో ఎన్.డి.బి కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించి, ఆయా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరిస్తామని మంత్రి తెలిపారు.. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు ప్రాధాన్యత కల్పించాలని మంత్రి అధికారులకు సూచించారు.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనుల్లో.. గతంలో ఎన్.డి.బి & సిఆర్ఐఎఫ్ కింద రద్దయిన 650 కి.మీ పనులకు అత్యంత ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను మంత్రి నొక్కిచెప్పారు.. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ముగిసిన క్రమంలో రహదారులు మరమ్మతులు & అభివృద్ధి పనులు వేగవంతం చేయాల్సిన అవసరాన్ని మంత్రి అధికారులు తెలియజేశారు.. మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆర్ & బి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎం.టి కృష్ణబాబు, చీఫ్ ఇంజనీర్లు శేషు కుమార్, విజయశ్రీ, తదితర ఉన్నతాధికారులు, ఎన్.డి.బి కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# ఆత్మనూన్యతను భావాన్ని విడనాడండి

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ గుణదల గంగిరెడ్డుల దిబ్బలో గల సాంఘిక సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. తొలిత జిల్లా కలెక్టర్ గంగిరెడ్డుల దిబ్బలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. 128 మంది ఇంటర్, పీజీ విద్యార్థులకు గాను 114 మంది విద్యార్థులు హాజరయ్యారు. మెను ప్రకారం పెసరపప్పుపొంగలి, పుట్నాల చెట్నీ, కోడిగుడ్డు, మిల్లెట్ చిక్కీ, విద్యార్థులకు అందించే తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాలలో వసతి పొంది విద్యనభ్యశించే విద్యార్థులు ఆత్మనూన్యత భావాన్ని విడనాడాలన్నారు. పేద విద్యార్థులు ఉత్తమ విద్యను అభ్యశించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టి అధునాతన మౌలిక వసతులు. పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. చిన్నతనంలో తాను కూడా హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యశించి ఈ స్థాయికి ఎదిగిన వాడినేనన్నారు.. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు ఎదురయ్యే ప్రతిబంధకాలను అధిగమించాలని అప్పుడే అనుకున్న ఫలితాలు సాధించగలుగుతామన్నారు. ఎంతో మంది మహానుభావాలు వసతి గృహాలలో ఉండి చదువుకుని అత్యంత ప్రతిభావంతులయ్యారని వారిని ఆదర్శంగా తీసుకుని కష్టాన్ని ఇష్టంగా చేసుకుని శ్రమించాలని సూచించారు. విద్యార్థులకు స్టార్టప్, స్కిల్ డవలప్‌మెంట్ గురించి వివరించి వినూత్నంగా ఆలోచించేలా చర్యలు తీసుకోవాలని, ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ హబ్‌ను విద్యార్థులకు సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ సంక్షేమ అధికారి విద్యార్థుల భవిష్యత్ పట్ల ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యం, క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులను ఎప్పటికప్పుడు చైతన్యంతులను చేసి పట్టుదలతో మంచి విద్యను అభ్యశించేందుకు కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించి వారానికి ఒక రోజు హాస్టల్స్‌ను సందర్శించి నిర్వహణలో లోపాలను గుర్తిస్తే సరిచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ముఖ్యంగా విద్యార్థుల ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, కాచి చల్లార్చిన నీటినే వినియోగించాలన్నారు. హాస్టల్స్‌కు సరఫరా చేసే మినరల్ వాటర్ ప్లాంట్లను వాటర్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. వసతి గృహ నిర్వహణలో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి నిర్వహించినప్పుడు విద్యార్థులలో మానసిక ఉల్లాసం పెరిగి ఆరోగ్యంతో పాటు మెరుగైన విద్యను అభ్యశించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. వసతి గృహాలలో కిచెన్ షెడ్ల నిర్వహణను నిశితంగా పరిశీలించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతిగృహంలో లివింగ్ రూమ్, డైనింగ్ కిచెన్ షెడ్ నిర్వహణకు సరిపోవడం లేదని, సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ కంపౌండ్ వాల్ పై ఇనుప కంచెను ఏర్పాటు చేయాలని ఆయా వసతి గృహాల సంక్షేమ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, అవసరమైన చర్యలు చేపట్టేలా జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సంక్షేమ వసతి గృహ తనిఖీలలో వెనకబడిన తరగతుల వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎ. విజయదుర్గ, సిబ్బంది ఎం. రాజశేఖర్, రెహమాన్, పి. రాజశేఖర్, సాంఘిక సంక్షేమ వసతి గృహ సంక్షేమ అధికారిణి ఎ.వనజా రమణి, సిబ్బంది ఎం.సమాధానం, విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు.

# ప్రజలకు కూటమి ప్రభుత్వం సూపర్ గిఫ్ట్

(మొదటిపేజీ తరువాయి)

ప్రోత్సాహాన్ని ఇచ్చేలా క్రీడ వస్తువులపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని ఐదు శాతానికి తగ్గించారు అన్నారు. క్రీడాకారులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది అన్నారు.హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ లకు 18 శాతం గా ఉన్న జీఎస్టీ ని పూర్తిగా తీసేశారు అని తెలిపారు. స్టేషనరీ పై కూడా 12 శాతంగా ఉన్న జిఎస్టిని ఐదు శాతానికి తగ్గించారు అన్నారు. నిత్యవసర సరుకుల ధరలు కూడా భారీగా తగ్గిపోయాయి అన్నారు.ట్రాక్టర్ కు 40 వేల రూపాయలు, కారుకు 70 వేల రూపాయలు, బైకు కు పదివేల రూపాయలు జీఎస్టీ తగ్గింపు ద్వారా ధరలు తగ్గాయి అన్నారు.గృహపకరణాలైన టీవీలు, ఏసీలు, ఫ్రిజ్జుల ధరలు కూడా దిగి వచ్చాయి అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఎంతో లాభం చేకూరుస్తోందని అన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ,జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను ప్రతి కుటుంబం పొందే అవకాశాన్ని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం కల్పించింది అన్నారు.జీఎస్టీ ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి 15 వేల రూపాయలు ఆదా అవుతోంది అన్నారు.జీఎస్టీ సేవింగ్స్ పై ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలి అని కోరారు.అంతర్జాతీయ స్థాయిలోనే ప్రతిష్టాత్మక సమస్త అయిన గూగుల్ లక్షల కోట్ల పెట్టుబడితో విశాఖకు రావడం మన రాష్ట్రానికి శుభ సూచకం అన్నారు.చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ, రాష్ట్ర అభివృద్ధి కోసం పెట్టుబడులు తెస్తుంటే చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారు అన్నారు.మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ మాట్లాడుతూ,అభివృద్ధి, సంక్షేమంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది అన్నారు.ఎన్నికలలో చంద్రబాబు ఇస్తానన్న సూపర్ సిక్స్ పథకాలు, జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో లాభం చేకూరుతుంది అన్నారు.తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా ప్రచార కార్యదర్శి, మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ,మాజీ మంత్రి పేర్ని నాని ఇండోర్ స్టేడియం అంటూ డ్రామాలాడి స్టేడియంను సరిగా పూర్తి చేయకుండా చెరువును తలపించే విధంగా నాలుగు రేకులతో ఇండోర్ స్టేడియం కట్టేసామని ఎన్నికల ముందు ఆట్టహాసంగా ప్రారంభించి క్రీడాకారులను పేర్ని నాని ఏ విధంగా మోసం చేశారో గ్రహించాలి అన్నారు.మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభోనేని బాలసౌరి,ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావుల సారధ్యంలో చెరువుల ఉన్న ఇండోర్ స్టేడియంలో మెరక పనులు చేయించామని, వైసిపి నాయకులు ప్రజా వేదికను ప్రజలకు ఉపయోగపడకుండా అక్రమ కట్టడం అంటూ కృష్ణా నది ఒడ్డున కూల్చివేశారని, అలా కూటమి నాయకులు చేయరని, క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా ఇండోర్ స్టేడియం ను పూర్తి చేయాలని సభాముఖంగా ఫణి కుమార్ కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, పి. వి. ఫణి కుమార్ లతోపాటుగా బిజెపి నాయకుడు,పంతం వెంకట గజేంద్ర,జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని, కే ఝాన్సీ లక్ష్మి, క్రీడా సంఘాల ప్రతినిధులు, సన్నిధ నాగ సాయి, ఎం. సుబ్బారావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీంకోర్టు ప్రధాని మీద జరిగిన దాడి హేయం





**విజయవాడ మేజర్ న్యూస్ :** శుక్రవారం ఎం ఆర్ పి యస్ నాయకులు మందా వేణు ఎం ఆర్ పి యస్, ఎం. ఈ యఫ్, అనుబంధ సంఘాలు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గన్నవరం గ్రామపంచాయతీ సర్పంచ్ నిడమర్తి సౌజన్య పాల్గొన్నారు. గన్నవరం పంచాయతీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి గన్నవరం తహసీల్దార్ కార్యలయం వరకు నిరసన ప్రదర్శన అనంతరం డిప్యూటీ తహసీల్దార్ దుర్గ భవాని కి వినతిపత్రం అందచేయటం జరిగింది. ఈ సందర్భంగా మందా వేణు మీడియా తో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డా " గావాయ్ పైన దాడి ని ఖండిస్తూన్నామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బియర్ మీద దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్షలు పడేలా స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని అందుకోసం సుప్రీంకోర్టు ప్రజాస్వామిక వాదులుగా గుర్తించబడ్డ సీనియర్ జడ్జిలతో విచారణ చేయించాలని, దళితుడైన బిఆర్గవై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రావడం కొన్ని ఆధిపత్య శక్తుల జీర్ణం తినక పోతున్నాయని అందుకే అహంపూరితంగా ఈ దాడికి తెగబడ్డారని, కావున ఈ దాడికి పాల్పడ్డ వ్యక్తి మీద తక్షణమే కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని అలాగే దాడి వెనక ఉన్న శక్తులను గుర్తించి వారికి శిక్షలు పడేలా ఈ ఘటన మీద సమగ్రమైన దర్యాప్తుడు జరిపించాలని అందు కోసం సుప్రీంకోర్టు అనుభవం కలిగిన ప్రజాస్వామిక దృక్పథం కలిగిన విద్యార్థిలను దర్యాప్తు కోసం నియమించాలని అలాగే ఎలాంటి గడ్డలను ఉన్నత న్యాయ వ్యవస్థలో పొనరావడం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని ఈ డిమాండ్లు తక్షణమే పరిగణ తీసుకొని తగిన చర్యలు తీసుకోవాలని మంద వేణుబాబు తెలిపారు. అనంతరం దేవరపల్లి విక్టర్ బాబు మాట్లాడుతూ ఇలాంటి సంఘటన కొనరావడం కాకుండా తగు చర్యలు తీసుకునేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని అక్టోబర్ 7 న భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గావాయ్ బెంచ్ మీద లాయర్లు వాదనలు వెళ్తున్న సమయంలో రాకేష్ కిషోర్ అనే వ్యక్తి విసిరి దాడికి పాల్పడ్డారని చీఫ్ జస్టిస్ మీద జరిగిన దాడిని అన్న గరికమైందనిఈ దాడి ప్రజాస్వామిక స్ఫూర్తి రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే ఉన్నదనిఈ దాడి సమస్త భారతీయులను దిగ్భ్రాంతికి గురి చేసిందని దళిత పీడత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదన గురి చేసిందని అందువల్ల దేశ ప్రజలందరూ ఈ దాడిని ఖండించాలని దేవరపల్లి విక్టర్ బాబు బాబు తెలిపారు.

ఈ కార్యక్రమం లో కృష్ణా జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి కోటా కృష్ణ మోహన్ మాదిగ, గన్నవరం నియోజకవర్గ కో ఇంచార్జ్ కొప్పుల కామేశ్వరరావు మాదిగా, కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి పచ్చి గళ్ళ భాస్కర్ ఉంగుటూరు మండల ఎంఎస్పి ఇన్చార్జ్ కొలపాక పాస్కల్ మాదిగ, విజయవాడ రూరల్ ఎంఎస్పి ఇన్చార్జిలు పారిటీగడ్డ దేవదాసు మాదిగ, చిల్లిమంత కోటేశ్వరరావు మాదిగ, విజయవాడ రూరల్ మండలం ఇంచార్జ్ కొక్కిలిగడ్డ కమల రాజు మాదిగ, గన్నవరం మండల నాయకులు ఏమండ అబినాష్ మాదిగ, సూరంపల్లి మాజీ సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు, నాగరప్పాడు మాజీ సర్పంచ్ గొన్నూరు శీనయ్య, వివిధ పార్టీలకు చెందిన నాయకులు కలపాల అబ్రహం జోనపూడి కృష్ణ పులపాక రాజా రత్నం వేల్పుల గోపి ఉయ్యూరు బుల్లబ్బాయి ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము సుదర్శన్ మాదిగ సొంగ దయాకర్ మాదిగ వంగూరు మరియదాసు మాదిగ నందేటి చత్రపతి మాదిగ నల్లమోతు కిషోర్ సిద్ధుల జయరాజు మాదిగ, వుడుముల దుర్గ రావు కృష్ణా మోహన్, యమందా అభినేష్, జువ్వనపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఈలో రూ.200 కోట్ల గ్రీన్ మున్సిపల్ బాండ్ పబ్లిక్ ఇష్యూను లిస్టింగ్ చేసిన సూరత్ మున్సిపల్ కార్పొరేషన్







**విజయవాడ మేజర్ న్యూస్ :** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఇ) శుక్రవారం గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సమక్షంలో సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ (ఎస్ఎంసి) గ్రీన్ మునిసిపల్ బాండ్ల పబ్లిక్ ఇష్యూ లిస్టింగ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల నుండి ఇతర కీలక సీనియర్ ప్రభుత్వ అధికారులు – దక్షేష్ మావానీ, మేయర్, సూరత్ నగరం, ఆశిష్‌కుమార్ చౌహాన్, ఎం డి & సిఇఓ, ఎన్ఎస్ఇ, షాలిని అగర్వాల్, సూరత్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, డాక్టర్ విక్రాంత్ పాండే, ముఖ్యమంత్రి కార్యదర్శి, గోయి డైరెక్టర్ గుర్జీత్ సింగ్ ధిల్లాన్, మోహువా, గోయి, డాక్టర్ హరీష్ అహుజా, ఇష్యూయర్ రిలేషన్‌షిప్ అండ్ సస్టైనబిలిటీ హెడ్, ఎన్ఎస్ఇ, కృష్ణన్ అయ్యర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, ఎన్ఎస్ఇ, పర్యావరణ వ్యవస్థ నుండి ఇతర ముఖ్య సీనియర్ ప్రముఖులు పాల్గొన్నారు. 100 కోట్ల బేస్ ఇష్యూ సైజు, అదనంగా 100 కోట్ల గ్రీన్–షూ ఎంపికతో కూడిన ఈ పబ్లిక్ ఇష్యూ, బేస్ ఇష్యూకంటే ఎనిమిది రెట్లు ఎక్కువ సబ్స్క్రిప్షన్ పొందింది. ఇది పెట్టుబడిదారుల బలమైన విశ్వాసాన్ని, అలాగే గ్రీన్ మునిసిపల్ ఇన్వెస్ట్‌మెంట్ సాధనాలపై పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోంది. ఈ జాబితా ద్వారా సూరత్, గుజరాత్ రాష్ట్రం నుండి తొలి మునిసిపల్ కార్పొరేషన్‌గా,, పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా మునిసిపల్ బాండ్ మార్కెట్‌ను యాక్సెస్ చేసిన భారతదేశంలో రెండవ నగరంగా నిలిచింది. ఈ జారీ ద్వారా సమీకరించబడిన నిధులు, వాతావరణ మార్పులను ఎదుర్కొనే సామర్థ్యమున్న కీలక పట్టణ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు కేటాయించబడతాయి: 1. 10 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్, 6.3 మెగావాట్ల పవన విద్యుత్ సౌకర్యం 2. బిఆర్‌టిఎస్ కింద కోసాడ్‌లో ఇంటిగ్రేటెడ్ వ్యర్థాల ప్రాసెసింగ్, పట్టణ అభివృద్ధి 3. వరియావ్ వద్ద 250 ఎంఎల్డి జీరో–లిక్విడ్ డిశ్చార్జ్ నీటి శుద్ధి కర్మాగారం 4. రాండర్ నీటి శుద్ధి కర్మాగారాన్ని అధునాతన వడపోతతో 160 ఎంఎల్డికి అప్‌గ్రేడ్ చేయడం. 5. 400 ఎంఎల్డి ముడి నీటి తీసుకునే వ్యవస్థతో పాటు అనుబంధ ప్రసార మౌలిక సదుపాయాలు– ఇవన్నీ క్లైమేట్ బాండ్స్ ఇనిషియేటివ్ యొక్క అంతర్జాతీయ గ్రీన్ సర్టిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ కింద ధృవీకరించబడ్డాయి. తన ప్రసంగంలో, గౌరవనీయ గుజరాత్ ముఖ్యమంత్రి, భూపేంద్ర పటేల్ ఇలా పేర్కొన్నారు, "గుజరాత్ నగరాలు ఆవిష్కరణల్లోను, ఆర్థిక బాధ్యతలోను ఎప్పటినుంచో ముందంజలో ఉన్నాయి" అని ప్రముఖంగా పేర్కొన్నారు. సూరత్ గ్రీన్ బాండ్‌తో మేము తదుపరి దశను చూస్తున్నాముఅర్బన్ ఫైనాన్స్ ఇప్పుడు పర్యావరణ సుస్థిరతతో సమన్వయమవుతోంది. స్వావలంబన వృద్ధి దిశగా మూలధన మార్కెట్లను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని పట్టణ స్థానిక సంస్థలను నిరంతరం ప్రోత్సహిస్తుంది."

ఆశిష్‌కుమార్ చౌహాన్, ఎండి & సిఇఓ, ఎన్ఎస్ఇ ఇలా అన్నారు, "సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ విజయవంతంగా చేపట్టిన తొలి పబ్లిక్ ఇష్యూకు మేము హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాము. ఎనిమిది రెట్లు అధికంగా వచ్చిన సబ్‌స్క్రిప్షన్, విశ్వసనీయమైన గ్రీన్ మునిసిపల్ బాండ్లపై రిటైల్, సంస్థాగత పెట్టుబడిదారుల పెరుగుతున్న విశ్వాసాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా భారతదేశం నాల్గవ అతిపెద్ద మూలధన మార్కెట్లలో ఒకటిగా నిలుస్తుండగా, స్థిరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నగరాలు, స్థానిక సంస్థలు పారదర్శకంగా నిధులను సేకరించేందుకు ఎన్ఎస్ఈ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు." ఆయన ఇంకా ఇలా తెలిపారు: "ఇప్పటి వరకు భారతదేశ మునిసిపల్ బాండ్ మార్కెట్‌లో 17 కార్పొరేషన్లు విడుదల చేసిన 24 జారీల ద్వారా రూ.13,500 కోట్లకు పైగా నిధులు సమీకరించబడ్డాయి. వీటిలో సుమారు మూడో వంతు గుజరాత్ రాష్ట్రం నుంచే వచ్చాయి, ఇది రాష్ట్ర నాయకత్వాన్ని ప్రతిఫలిస్తుంది. నేటి జాబితా దేశవ్యాప్తంగా పూల్డ్ ఫైనాన్స్ నమూనాలు, భవిష్యత్ గ్రీన్ బాండ్ కార్యక్రమాలకు బలమైన పునాదిని వేస్తుంది." సభికులకు కృతజ్ఞతలు తెలుపుతూ, షాలిని అగర్వాల్ సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇలా అన్నారు, "సూరత్ మునిసిపల్ కార్పొరేషన్‌పై నమ్మకం ఉంచినందుకు మా భాగస్వాములు, పెట్టుబడిదారులందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఈ విజయవంతమైన పబ్లిక్ ఇష్యూ సూరత్‌కే కాకుండా, భారతదేశ హరిత వృద్ధి యాత్రలో పట్టణాల కీలక పాత్రపై ఉన్న విశ్వాసానికి ఒక ప్రతీక. మేము స్థిరమైన మౌలిక సదుపాయాల ఫైనాన్సింగ్ పరిధిని విస్తరించడానికి కృషి చేస్తూ, సూరత్‌ను స్థితిస్థాపకతతో కూడిన, వాతావరణ–స్మార్ట్ పట్టణ అభివృద్ధికి ఒక ఆదర్శ నమూనాగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఈ వేగం, ఈ దిశలో మరింత పురోగతికి ప్రేరణగా నిలుస్తుంది."



## సుప్రీం ప్రధానిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**విజయవాడ రూరల్, మేజర్ న్యూస్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డా. బి ఆర్ గవాయి మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ గవాయి మీద దాడి చేసినటువంటి వ్యక్తిపై, అలాగే దానికి కారణమైన వారిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ విషయంపై తగు విచారణ జరిపించి తక్షణమే దాడి చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విజయవాడ రూరల్ మండలం ఎమ్మార్వోకి వినతిపత్రం ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం ఇంచార్జ కొక్కిలిగడ్డ కమలరాజు మాదిగ అంబాపురం ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్ మాదిగ సొంగ దయాకర్ జి.ప్రభాకర్ కొడాలి సుమన్ కొండ్రు దాసు తదితరులు పాల్గొన్నారు.

## చీఫ్ జస్టిస్‌పై చెప్పుల దాడి దారుణం

**బల్లారపు జగదీష్ కుమార్**

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ పై ఒక న్యాయవాది సాక్షాత్తు సుప్రీం కోర్టు లోనే, చెప్పులతో దాడి చేయడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మిషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ తీర్మానాన్ని రాష్ట అధ్యక్షులు డాక్టర్ బల్లారపు జగదీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజ్యాంగ పరిరక్షకులైన సుప్రీం చీఫ్ జస్టిస్ పై చెప్పులిసరడం చాలా అన్యాయమన్నారు. దళితుడైన సీజే గవాయి ని ఆ విధంగా అవమానించడం, మొత్తం దళిత సామాజిక వర్గాన్ని అవమానించడం గానే తాము భావిస్తున్నామన్నారు. రాజ్యాంగ పరిరక్షకులైన సుప్రీం సీజేని ఇలా అవమానించడం, భారత రాజ్యాంగాన్ని–రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను ఆ గౌరవపరచడమే నన్నారు. మనువాద మతోన్మాద తీవ్రవాద శక్తుల ప్రేరణతోనే ఆ న్యాయవాది ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. ఇలాంటి దుష్ట చర్యలకు పాల్పడే వారిని రాజ ద్రోహం క్రింద కఠిన చర్యలు గైకొనాలన్నారు. భవిష్యత్తులో రాజ్యాంగాన్ని–న్యాయమూ ర్తులను – అంబేద్కర్‌ను అవమానించే వ్యక్తులు శక్తులను కఠినంగా శిక్షించాలని, రాష్ట్ర కార్యవర్గం, అధ్యక్షులు డాక్టర్ జగదీష్ కుమార్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## కోహెన్స్ కెమికల్స్ సంస్థ ఆధ్వర్యంలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ కి విశేష స్పందన



**జగ్గయ్యపేట, అక్టోబర్ 17, మేజర్ న్యూస్ :** పట్టణంలో జె ఆర్ సి – విశ్వ భారతి డిగ్రీ కళాశాలలో కోహెన్స్ కెమికల్స్ సంస్థ ఆధ్వర్యంలో వాక్–ఇన్ ఇంటర్వ్యూ కార్యక్రమాన్ని శ్రీరాం ధనుంజయ (చినబాబు) ప్రారంభించారు. స్థానిక జెఆర్‌సి –విశ్వభారతి డిగ్రీ కాలేజీలో కోహెన్స్ కెమికల్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్–ఇన్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమాన్ని జగ్గయ్యపేట శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోదరుడు శ్రీరామ్ ధనుంజయ (చినబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కోహెన్స్ కెమికల్స్ వంటి సంస్థలు ముందుకు రావడం అభినందనీయం. ఇది జగ్గయ్యపేట పరిసర ప్రాంత నిరుద్యోగులకు ఒక మంచి అవకాశ వేదికగా నిలుస్తుందని అన్నారు. ఈ వాక్–ఇన్ డ్రైవ్‌లో దాదాపు 70 మంది కెమిస్ట్రీ గ్రాడ్యుయేట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను పరిశీలించేందుకు కోహెన్స్ కార్పొరేట్ సీనియర్ హెచ్.ఆర్ మేనేజర్ సాయి రామ్, స్థానిక హెచ్.ఆర్ రాము వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించారు. త్వరలో ఎంపికైన అభ్యర్థులకు కాల్ లెటర్స్ పంపిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెఎన్ రమేష్ యాజమాన్య ప్రతినిధులు రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకట రాజీవ్, జల్లా తిరుపతి రావు, వి.వి.ఎల్. నారాయణ రావు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. హాజరైన నిరుద్యోగ యువతీ యువకులు కోహెన్స్ కెమికల్స్ సంస్థకు, జె ఆర్ సి – విశ్వభారతి కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



## బిల్లుల చెల్లింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలి



కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పూర్తి చేసిన పనుల బిల్లుల చెల్లింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కార్పొరేట్ సామాజిక బాధ్యత సిఎస్ఆర్,జిల్లా పరిషత్, జిల్లా ఖనిజ ఫౌండేషన్ ట్రస్ట్ డీఎంఎఫ్టీ,ఎంపీలాడ్స్ తదితర నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతి, బిల్లుల చెల్లింపులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పూర్తి చేసిన పనులకు సకాలంలో బిల్లులు రూపొందించి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, కాంట్రాక్టర్లకు తుది బిల్లు చెల్లించేంత వరకు అధికారులదే బాధ్యతని చెబుతూ, అశ్రద్ధ చేయకుండా బిల్లుల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం ఏర్పాటుకు పైపు లైన్ నిర్మాణం,మైక్రో ఫిల్టర్ల ఏర్పాటు తదితర పనులకు డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్, ఎంపీల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా స్వచ్ఛభారత్ కింద జిల్లాకు మంజూరైన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలను వేగవంతం చేసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం కార్యనిర్వాహణాధికారి సోమశేఖర్, మచిలీపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్, సిపిఓ భీమరాజు, గనుల శాఖ ఏడి కొండారెడ్డి, ఐసిడిఎస్ అధికారులు, ఇతర ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ జైలుకెళ్లటం ఖాయం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మాజీ మంత్రి జోగి రమేష్ కల్తీ మద్యం కేసులో త్వరలో జైలుకె ళ్లటం ఖాయమని టిడిపి నాయకులు అంతేం సురేష్ పేర్కొన్నారు శుక్రవారం తన నివాసం లో జరిగిన విలేకరుల సమావేశం లో సురేష్ మాట్లాడుతూ మాజీ మంత్రి జోగి రమేష్ కల్తీ మద్యం వ్యవహారంలో అన్ని కోణాల్లో పలు విధాలుగా పీకల్లోతుగా ఇరుక్కున్నారని ఇది జగమెరిగిన సత్యం అని వారు వెల్లడించారు. దొంగే దొంగ అన్న చందంగా మాజీ మంత్రి జోగి రమేష్ ప్రజలను మభ్య పెట్టడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని వీటిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని సురేష్ పేర్కొన్నారు. జోగి రమేష్ వ్యవ హార శైలి అటు రాష్ట్ర ప్రజలకు, ఇటు మైలవరం నియోజకవర్గ ప్రజలకు తెలుసు అన్నారు. ఆయన త్వరలో జైలు కెళ్ళటం, ఊసలు లెక్క పెట్టటం ఖాయమని అందుకు సిద్ధంగా ఉండాలని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన విచారణ పూర్తి చేసి మాజీ మంత్రి జోగి రమేష్ పై కఠిన చర్యలు తీసుకోవాలని సురేష్ డిమాండ్ చేశారు.

### జర్నలిస్టులపై పోలీసుల నిరవధిక విచారణను నిరసిస్తూ
## అవనిగడ్డలో నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** జర్నలిస్టులపై అక్రమ కేసులు పెడుతూ సాక్షి కార్యాలయాల్లో నిరవధిక విచారణను నిరసిస్తూ, ఎడిటర్, స్టాఫ్ రిపోర్టర్ల పై అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ జర్నలిస్టులు నిరసన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం అవనిగడ్డ నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన ర్యాలీ చేశారు. అవనిగడ్డ ప్రెస్ క్లబ్ నుంచి డిఎస్పీ కార్యాలయం వరకూ మౌన ప్రదర్శన చేశారు.. అనంతరం డిఎస్పీ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పుట్టి శ్రీనివాసరావు, సింహాద్రి కృష్ణ ప్రసాద్, అప్పికట్ల శ్రీనివాసరావు తో పాటు నియోజకవర్గంలోని పలువురు జర్నలిస్టులు, మహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్, జై భీమ్ రావు భారత పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు సముద్రాల అంబేద్కర్, మండల అధ్యక్షుడు గొరుముచ్చు రవి తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. రోడ్డు ప్రమాదాల స్థితిగతులు, రహదారులపై బ్లాక్ స్పాట్లకు తీసుకున్న చర్యలు, డ్రంక్ అండ్ డ్రైవ్, హిట్ అండ్ రన్ మోటార్ యాక్సిడెంట్ కేసులు, ప్రమాదాల నివారణకు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తదితర అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని, ముఖ్యంగా జిల్లాలోని మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి నంబర్ 65, జాతీయ రహదారి 216లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రమాదాలకు నిలయమైన బ్లాక్ స్పాట్లను గుర్తించి సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన చోట్ల ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏఐ పవర్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎన్నిమార్లు చెప్పినా అమర్చక పోవడం పట్ల ఆయన జాతీయ రహదారుల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇది సరైనది కాదని హెచ్చరిస్తూ జాతీయ రహదారులపై జరిగే హిట్ అండ్ రన్ కేసులను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తాయని గుర్తు చేశారు. మచిలీపట్నం నగరంలోని ప్రధాన రహదారులపై యూ టర్న్ తీసుకుని వచ్చే వాహనాలు, అదేవిధంగా ఆ వాహనాలకు ఎదురుగా వచ్చే ఇతర వాహనాలు పరస్పరం ఢీకొని ప్రమాదాలు జరక్కుండా ఉండేందుకు అక్కడ ఏర్పాటు చేసిన బారికేడ్లకు బదులుగా ఎత్తు తక్కువగా ఉండే సిమెంట్ దిమ్మలు ఏర్పాటు చేయాలని, తద్వారా వాహనచోదకుడికి వచ్చే వాహనం కనిపించి ప్రమాదాలు జరక్కుండా ఉంటాయని అన్నారు. అదేవిధంగా జంక్షన్ల వద్ద పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్ ను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్కు సూచించారు.వాహనం నడిపే సమయంలో డ్రైవర్ ఫోన్ మాట్లాడటం, స్టీరింగ్ సరిగా పట్టుకోకుండా నడపటం,మగతతో వాహనం నడిపినా అప్రమత్తం చేయగల ప్రత్యేక పరికరం పనితీరుపై గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఈ సందర్భంగా డెమో ద్వారా వివరించారు. ఆయన విద్యార్థులను అభినందించి, అవసరానికి తగిన విధంగా మరింతగా అభివృద్ధి చేసి పరికరాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కళాశాల అధ్యాపకుడు డాక్టర్ సురేంద్రకు సూచించారు. వాహనాల్లో ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే విధంగా ఉన్నతాధికారులతో మాట్లాడి పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జిల్లా ప్రజా రవాణా అధికారికి సూచించారు. 2025 సెప్టెంబరు నెలలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మొత్తం 63 రోడ్డు ప్రమాదాలు సంభవించగా, వాటిలో 32 మరణాలు, 47 మంది గాయాలపాలయ్యారని, అత్యధికంగా జాతీయ రహదారులపై 20, రాష్ట్ర రహదారులు 5, ఇతర రహదారులపై 7 మరణాలు సంభవించినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. వీటిలో అత్యధికంగా ద్విచక్ర వాహనాలు వల్ల 12 మరణాలు, కార్లు, వ్యాన్లు, జీపులు వల్ల 10, లారీలు 5, ట్రాక్టర్లు వల్ల 3 మరణాలు సంభవించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి వీవీ నాయుడు, జిల్లా రవాణా అధికారి ఎన్ యు ఎన్ ఎస్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, మచిలీపట్నం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లోకేశ్వరరావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆర్ కుముదిని సింగ్, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకట్రావు, జిల్లా ప్రజా రవాణా అధికారి వెంకటేశ్వరులు, జాతీయ, రాష్ట్ర రహదారులు, పోలీసు తదితర శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాతృత్వ మరణాల నివారణకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి



కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో మాతృత్వ మరణాలు సంభవించకుండా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వైద్యాధికారులను ఆదేశించారు.శుక్రవారం మధ్యాహ్నం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్లో వైద్యాధికారులతో సమావేశమై ప్రసూతి మరణాలపై సమీక్షించారు. ఈ క్రమంలో ఆయన జిల్లాకు సంబంధించిన రెండు ప్రసూతి మరణాల కేసులను విచారించి, వారి మరణానికి గల కారణాలను వారికి చికిత్స చేసిన వైద్యులను, ఘటనా వివరాలను బాధితుల బంధువులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతృత్వ మరణాలను నివారించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా హై రిస్క్ ప్రెగ్నెంట్ కేసుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ప్రాణనష్టం జరక్కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలోని గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, వారు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నప్పటికీ అవసరమైన వైద్య పరీక్షలు, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడుతున్నది లేనిది ఆరా తీయాలని సూచించారు.

వారు తీసుకోవాల్సిన పోషకాహారం, ప్రత్యేక జీవనశైలి విధానంపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకట్రావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ శేషు, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రేమ్ చంద్, జిజిహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఇతర వైద్యులు, ఐసిడిఎస్ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు సత్వరమే సీఎంఆర్ఎఫ్ ఆర్థికసాయం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శుక్రవారం చెక్కులు, ఎల్.ఓ.సీల రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 50 మందికి రూ. 69,41,730 లు ఆర్థికసాయం తాజాగా మంజూరైంది. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 23 మందికి సీఎంఆర్ఎఫ్ రీఎంబర్స్ మెంట్ చెక్కులను, 27 మందికి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్.ఓ.సి)లను, సీఎం చంద్రబాబు నాయుడు సందేశ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నుంచి సత్వరం ఆర్థికసాయం అందుతుందన్నారు. రెడ్డిగూడెం మండలంలోని ఒకరికి రూ. 30,028లు, మైలవరం మండలంలోని ఏడుగురికి రూ. 3,45,533లు, జి.కొండూరు మండలంలోని నలుగురికి రూ. 2,17,543లు, ఇబ్రహీంపట్నం మండలంలోని ఐదుగురికి రూ. 3,07,667లు, విజయవాడ రూరల్ మండలంలోని ఆరుగురికి రూ. 4,61,883లు మొత్తం రూ. 13,62,654లు మంజూరైనట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. ఇవికాక మరో 27 మందికి రూ. 55,79,076లు లెటర్ ఆఫ్ క్రెడిట్ కింద వైద్య సేవలు, శస్త్రచికిత్సల నిమిత్తం ఆర్థికసాయం మంజూరు అయినట్లు వెల్లడించారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నాయకులపై కూటమి నాయకులు ఫైర్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి.కొండూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో కూటమి నాయకులు మీడియా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు. వేములకొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. వైసిపి నాయకులు దగ్గర మేము అడిగే ప్రశ్నలకు సమాధానం లేదు. వైసీపీ నాయకులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. మంత్రి లోకేష్ బాబుని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పై బురద చల్లడం తప్ప పని ఏమీ లేదని అని ఎదవ చేశారు. వైసిపి నాయకులు గత ప్రభుత్వంలోని వార్డు నెంబర్ కు పనికిరాని నాయకులను సర్పంచులుగా ఎంపీపీలుగా, ఎంపీటీసీలుగా, జెడ్పిటిసిలుగా తన సొంత నిధులతో గెలిపించిన ఘనత వసంత కృష్ణ ప్రసాద్ దే అని అన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దయ దక్షిణాలతో గెలిచి ఈరోజు వారిని విమర్శించే స్థాయికి వచ్చినందుకు సభ్య సమాజం సిగ్గుపడలా ఉందని ఆయన అన్నారు. మాజీ మంత్రి జోగు రమేష్ కొండపల్లి ఐడిఏ పారిశ్రామిక వాడ వద్ద కల్తీ కళ్ళు అమ్మింది నువ్వు కాదా. ఇబ్రహీంపట్నం గ్రామం లంకల్లో నాటసార తయారు చేసి అమ్మింది నువ్వు కాదా. ఇబ్రహీంపట్నంలో బార్లు వైన్స్ లు లైసెన్స్ పొంది నువ్వు కల్తీ మద్యం అమ్మింది నువ్వు కాదా. ఇవన్నీ మైలవరం నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని అందుకే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 11 సీట్లకే పరిమితమయ్యారని కూటమి ప్రభుత్వానికి 163 సీట్లు కట్టబెట్టిన వైసీపీ నాయకులకు బుద్ధి రాలేదని.మీ వైఎస్ఆర్ పార్టీకి శ్రేణులకు సిగ్గు ఎగ్గ లేకుండా రోడ్డున పడుతున్నారని. తెలుగుదేశం పార్టీ జి. కొండూరు మండల పార్టీ అధ్యక్షులు వేములకొండ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఉయ్యూరు వెంకట నరసింహారావు మాట్లాడుతూ. తెలంగాణ నుండి ఆంధ్రకు లిక్కర్ సప్లై చేస్తుంటే. జోగి రమేష్ కి సంబంధించిన వాహనాలు ఇప్పటికీ జి. కొండూరు పోలీస్ స్టేషన్లో ఉన్నాయని. గుర్తు చేశారు. అలాగే నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగాలు అమ్ముకుంది నువ్వు కాదా అని ప్రశ్నించారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్‌లో కాంట్రాక్ట్ లేబర్ ఉద్యోగాలు అమ్ముకుంది నువ్వు కాదా అని ప్రశ్నించారు. అలాగే అంగన్వాడి సూపర్వైజర్ పోస్టను నీ చెంచా నాయకుల్ని పెట్టి అమ్ముకుంది నిజం కాదా. ఇవన్నీ పక్కనపెట్టి గురిగింజ సామెత లాగా తన నలుపు తను వేరుకుగా ప్రభుత్వంపై బురదల్లే కార్యక్రమాలు చేస్తే. ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఆయన అన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ మధు ఆంజనేయులు లాయర్ మాట్లాడుతూ జి. కొండూరు కు చెందిన ఎంపీపీకి టికెట్ లేకపోతే మా గ్రామం నుండి ఎంపీపీగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు గ్రామం మొత్తం వేములకొండ లక్ష్మి తిరుపతమ్మ ని ఎంపీపీగా చేసుకుంటే ప్రజలకు ఉపయోగపడకపోగా ఇసుక మట్టి గ్రావియులు రియల్ ఎస్టేట్ వంటి వ్యాపారాలు చేసుకుంటూ ప్రజల బాగోగులు పట్టించుకోకుండా ప్రజలను గాలికి వదిలేసిన మీరు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని, మంత్రి లోకేష్ బాబుని, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ని విమర్శించడం సరికాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి లంక నాగేశ్వరరావు, బీసీ సెల్ నాయకులు పటా పటా పంచుల నరసింహారావు, లంక రామకృష్ణ, మంగళంపాటి వెంకటేశ్వరరావు, జి కొండూరు సొసైటీ బ్యాంకు చైర్మన్ పజ్జూరు శ్రీనివాసరావు, లంక నాగేశ్వరరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, జి.కొండూరు గ్రామ పార్టీ అధ్యక్షులు పజ్జూరు విజయకుమార్, బొర్రా అశోక్, రేపాని శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షులు వెంకటస్వామి, జి. కొండూరు గ్రామ మాజీ సర్పంచ్ చందా చిన్న నాగయ్య,బేతపూడి ఏసు, గొట్టిముక్కుల వెంకటేశ్వరరావు, చల్లా ప్రభాకరావు, మొదలగు వారు పాల్గొన్నారు.

# కోడూరు గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** జి కొండూరు మండలం కోడూరు గ్రామంలో పుట్టపర్తి శ్రీ సత్య సాయి బాబా శతవర్ష జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు.గ్రామ సర్పంచ్ వంగూరి ప్రసాద్ ఈ పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మైలవరం డివిజన్ పశు వైద్య అసిస్టెంట్ డైరెక్టర్ వి. హరిహరనాథ్, వెలగలేరు పశువైద్యాధికారి డి హరీష్ లు పశువులకు పరీక్షలు నిర్వహించినారు. పశు పోష కులకు మూగజీవాల అభివృద్ధి నిమిత్తం సదరు వైద్యులు సలహాలు, సూచనలు ఇచ్చారు. విజయవాడలోని సీతారామపురం శ్రీ సత్య సాయి బాబా ట్రస్టు నిర్వాహకులు రూ10000 విలువ గల మందులు, ఇంజక్షన్లను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో 251 గొర్రెలు, 4 పశువులు చూడు కట్టుకొనుటకు, 2 పశువులకు చూడు పరీక్షలు,ఎదకు వచ్చిన వాటికి 2 వీర్యముఇంజెక్షన్, నత్తల నివారణకు 17 పశువులు, పొదుపు వాపు 1 పశువు, 8 పశువులు ఎదకు రావడం కొరకు అలాగే మేత మేయని 14 పశువులకు పరీక్షలు నిర్వహించి వాటికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్య ఉన్నతాధికారి వి హరిహరనాథ్ మాట్లాడుతూ పశుపోషకులు మూగ జీవాలు పెంపకం పట్ల పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాటికి తరచూ వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి సకాలంలో వాటికి వైద్యం చేపించడం వలన రోగాల బారి నుండి బయటపడవచ్చునని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దత్తత గ్రామాల ఇంచార్జ్ టీజేఆర్ గుప్తా, సేవా దళ్ ఇంచార్జ్ ఎన్ తులసీరామ్, గోపాలమిత్ర డి అర్జున్ వై లిఖిత, సేవాదళ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట







**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయం గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అగమాచార్య శ్రీ పరాశరం రామకృష్ణమాచార్య పాకయాజి పర్యవేక్షణలో అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య యంత్రస్థాపన అనంతరం గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట నిర్వహించారు. విశేషఅలంకరణలోని గంగానమ్మతల్లి ముందుగా గోమోతదర్శనానంతరం దాతలు, ప్రత్యేక పూజలో పాల్గొన్నవారు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్ల నైవేద్యంతో పుసుపు, కుంకుమ, నూతనవస్త్రాలను గంగానమ్మతల్లికి నివేదించారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, యార్లగడ్డ సతీష్, చలమలశెట్టి రమేష్బాబు, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మూల్పూరి సాయికళ్యాణి తదితరులు గంగానమ్మతల్లి ప్రత్యేక పూజలో వేద మంత్రోచ్చారణల మధ్య యంత్రస్థాపన అనంతరం గంగానమ్మతల్లి విగ్రహప్రతిష్ట నిర్వహిం చారు. విశేషఅలంకరణలోని గంగానమ్మతల్లి ముందుగా గోమాతదర్శనానంతరం దాతలు, ప్రత్యేక పూజలో పాల్గొన్నవారు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పొంగళ్ల నైవేద్యంతో పుసుపు, కుంకుమ, నూతనవస్త్రాలను గంగానమ్మతల్లికి నివేదించారు. గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, యార్లగడ్డ సతీష్, చలమలశెట్టి రమేష్బాబు, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మూల్పూరి సాయికళ్యాణి తదితరులు గంగానమ్మతల్లి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. చుట్టుప్రక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులకు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులకు భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## ప్రముఖ కవి ఎక్స్-రే కొల్లూరి మృతికి ఎమ్మెల్యే సంతాపం



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఎక్స్-రే కొల్లూరిగా గుర్తింపు పొందిన ప్రముఖ కవి, ఎక్స్-రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకులు కొల్లూరి సూర్యనారాయణమూర్తి (69) ఆకస్మిక మరణం తనను ఎంతో దిగ్భ్రాంతికి గురి చేసిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కూడా పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురించి తనతో ఫోనులో మాట్లాడినట్లు తెలిపారు. చివరి శ్వాస విడిచేవర కూ సాహితి, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల నిర్వహణ గురించి పరితపిం చే వారన్నారు. కొల్లూరి సూర్యనారాయణమూర్తి ఎక్స్-రే అవార్డుల ద్వారా ఎందరో కవులలో స్ఫూర్తి నింపారన్నారు. విజయవాడలో మహాకవి శ్రీశ్రీ విగ్రహ ప్రతిష్టాపన చేయించారని తెలిపారు. ఆయన నిర్వహించే ప్రతి కార్య క్రమానికి తనను పిలిచేవారని, కొల్లూరి సూర్యనారాయణ మూర్తిలాంటి నిర్మాణ కార్యకర్తలు అరుదుగా ఉంటారన్నారు. ప్రత్యేకించి సాహిత్య రంగం గొప్ప స్ఫూర్తి ప్రదాతను కోల్పోయిందన్నారు. కొల్లూరి చికిత్స పొందుతూ గురువారం రాత్రి తాడేపల్లిలోని ఒక వైద్యశాలలో తుది శ్వాస విడిచారు అన్నారు. కొల్లూరి ఆత్మశాంతి కలిగించాలని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యు లకు తన ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కొల్లూరికి భార్య ఒక కుమార్తె ఉన్నారు.

## శ్రీ లంకమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.7,73,000



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమకు కొంగుబంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లున్న అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ అమ్మ వారి ఆలయంలోని హుండీ ఆదాయం రూ.7,72,753లు వచ్చినట్లు ఆలయ అధికారు లు తెలిపారు. శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ హుండీలను లెక్కించగా ఆరు నెలల కాలానికి రూ.7,72,753లు ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) వివరించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 22వ తేదీ నుండి అక్టోబర్ 16 వరకు అనగా 175 రోజుల కాలానికి గాను ఈ మొత్తం వచ్చిందన్నారు గతం కంటే 22 వేల రూపాయలు స్వల్పంగా పెరిగిందన్నారు ఈ హుండీ లెక్కింపులో అధికారి సుధాకర్ గ్రామ పెద్దలు అన్నపరెడ్డి వెంకటస్వామి, యాసం శ్రీరాములు, అన్నపరెడ్డి జయ భాస్కర్ రావు, యక్కటి కృష్ణ,ఆసాధులు పెనుమూడి చంద్రశేఖర్ తలగడదీవి బాలకృష్ణ రేపల్లె, హనుమాన్, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## పైడమ్మ దేవస్థాన ట్రస్ట్ బోర్డు కొత్త కమిటీ ప్రమాణ స్వీకారం



**పెడన మేజర్ న్యూస్:** రాష్ట్రంలోని వివిధ దేవాలయాలకు ట్రస్ట్ బోర్డు ఛైర్మన్లను, సభ్యుల నియామకంలో భాగంగా పెడన పట్టణ గ్రామదేవత అయిన శ్రీ పైడమ్మ అమ్మవారి దేవస్థాన నూతన ట్రస్ట్ బోర్డు కమిటీని ప్రభుత్వం నియమించి ప్రమాణ స్వీకార కార్యక్రమం చేసామని ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం దేవాలయంలో జరిగిన కార్యక్రమానికి బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా దాసు వాయునందనరావు, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారికి శాలువాలు, పూలమాలలతో ఘన సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ దాసు వాయునందనరావు మాట్లాడుతూ ఆలయ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తాముఅని చెబుతూ భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నిస్తాము అని తెలిపారు. జాతర మహోత్సవాలలో ప్రత్యేక ఏర్పాట్లు కూడా పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. తమ నియామకానికి సహకరించిన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్కు చైర్మన్, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో



కూటమి ప్రభుత్వ నాయకులు, దేవాదాయ ధర్మా దాయ శాఖ అధికారులు తదితరులున్నారు.




## స్కోడా ఇండియా నుంచి కొత్త ఆక్టేవియా ఆర్ఎస్

**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలో 25 ఏళ్ల ప్రయాణాన్ని సంబరాలుగా జరుపుకుంటున్న సందర్భంగా స్కోడా ఆటో ఇండియా, నిజమైన లెజెండ్ అయిన సరికొత్త ఆక్టేవియా ఆర్ఎస్ మోడల్‌ను తిరిగి తీసుకొచ్చింది. పూర్తిగా-నిర్మించిన యూనిట్ గా పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉన్న ఆక్టేవియా ఆర్ఎస్, సరిలేని డ్రైవింగ్ డైనమిక్స్‌ని, బోల్డ్ డిజైన్‌ను, ఇంకా ఎక్కడా తగ్గని ఆర్ఎస్ స్పిరిట్‌ను అందిస్తూ, దేశంలో ఈ పునరాగమనాన్ని నిరూపిస్తూ ఆసక్తి గల వారికి ఎక్స్‌క్లూజివ్ ఐకాన్‌గా నిలుస్తోంది. ఆవిష్కరణను పురస్కరించుకొని స్కోడా ఆటో ఇండియా, బ్రాండ్ డైరెక్టర్, ఆశిష్ గుప్తా మాట్లాడుతూ, స్కోడా కుటుంబంలోకి సరికొత్త తరాన్ని ఆహ్వానించాలని ఆత్రుతగా ఉన్నామని అన్నారు. ఈ వైభవాన్ని ఇలాగే కొనసాగిస్తూ, ఈ మార్కెట్‌లో అభిమానుల ఇష్టాన్ని నిర్వచించే బ్రాండ్‌గా ఉంటామని తెలియజేయడానికి గర్వంగా ఉన్నామని పేర్కొన్నారు.

## ఓరియంట్ ఎలక్ట్రిక్ తదుపరి తరం లైటింగ్ ఉత్పత్తులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** సీకేఏ బిర్లా గ్రూప్‌లో భాగమైన ఓరియంట్ ఎలక్ట్రిక్ లిమిటెడ్, పండుగ సీజన్ ప్రారంభంలో అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల ప్రాధాన్యతలు, ప్రాంతీయ ధోరణులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన సమగ్ర శ్రేణి లైటింగ్ పరిష్కారాలను ఆవిష్కరించింది. అభిమానులలో తన నాయకత్వాన్ని కొనసాగిస్తూ, లైటింగ్ విభాగం కంపెనీకి కీలకమైన వృద్ధి చోదకంగా మారింది. ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో, బ్రాండ్ నిర్మాణంలో పెట్టుబడులు మార్కెట్ వాటాలో స్థిరమైన వృద్ధికి దారితీసింది. వినియోగదారుల ఇటీవలి పోకడలు శక్తి సామర్థ్యం, అధికవాటేజ్, చూసేందుకు సౌకర్యంగా ఉండే డిజైన్‌ను మిళితంచేసే లైట్ల వైపు మార్పును చూపిస్తున్నాయి. స్మార్ట్ లైటింగ్ స్వీకరణ కూడా పెరుగుతోంది. అనుకూల మూడ్ సెట్టింగ్‌లు వృద్ధి చెందుతున్న పోకడగా మారింది. గేమింగ్ సెటప్‌లు, ఇంటి స్పేస్ నుంచి పార్టీ లైటింగ్ వరకుమార్పును కోరుకుంటున్నారు. ఓరియంట్ ఎలక్ట్రిక్ విస్తరించిన ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో ఈ ధోరణులన్నింటినీ అర్థం చేసుకుని, ఆధునిక నివాసాల పరిష్కారాల పూర్తి పోర్ట్‌ఫోలియోను అందిస్తోంది.

## స్వ డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రీతి జి జింటా



**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలోని ప్రముఖ ఫైన్ జువెలరీ బ్రాండ్లలో ఒకటైన స్వ డైమండ్స్, ప్రముఖ భారతీయ నటి ప్రీతి జి జింటాను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా స్వాగతించడం ద్వారా ఒక కొత్త మైలురాయిని చేరుకుంది. ఆమె నిత్యనూతనమైన అందం, ఆత్మవిశ్వాసంతో కూడిన ఉనికితో, స్వ డైమండ్స్ భారతదేశం, యూఏఈ అంతటా తమ ఉనికిని బలోపేతం చేసుకునే దిశగా ఒక సాహసోపేతమైన అడుగు ముందుకు వేసింది. ఈ సందర్భంగా స్వ డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ గఫూర్ అనాదియన్ మాట్లాడుతూ, తమ కొత్త ప్రచారం, యాజ్ రియల్ యాజ్ యూ.. సహజత్వాన్ని వేడుకగా జరుపుకుంటుందని అన్నారు. స్వ డైమండ్స్ కొత్త బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులైన ప్రీతి జి జింటా, ఈ భాగస్వామ్యంపై తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## సుప్రీంకోర్టు గౌరవాన్ని నిలపాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయ్పై దాడిచేసిన న్యాయవాది రాకేష్ కిషోర్ సుమోటోగా కేసునమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గౌరవాన్ని నిలపాలని ఎమ్మార్పీఎస్ నేతలు నినదించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆదేశానుసారం సీజేఐపై జరిగిన దాడిని నిరసిస్తూ శుక్రవారం చల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్ పి, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. అనంతరం డీటీ శ్రీలతకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కొక్కిలిగడ్డ నవీన్, కొడాలి ఏలియా, కొల్లూరు సురేంద్ర, కొక్కిలిగడ్డ రమేష్, మట్టా శ్రీనివాసరావు, తాడంకి శ్రీకాంత్, కొమ్ము మల్లిబాబు, బాబూరావు, చింతయ్య, శశిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పంచ పరివర్తన సాధనకు పునరంకితం కావాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్రీయ స్వయంసేవక్ (ఆర్ఎస్ఎస్) స్ఫూర్తి తో సమ సమాజ స్థాపన భారతీయ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా పంచ పరివర్తన సాధనకు విశ్వహిందూ పరిషత్ శ్రేణులంతా పునరంకితం కావాలని కృష్ణా జిల్లా విశ్వహిందూ పరిషత్ మఠమందిర్ సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ పిలుపునిచ్చారు శుక్రవారం మండల పరిధిలోని పులిగడ్డ కనకదుర్గమ్మ ఆలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పంచ పరివర్తన గురించి వివరించారు ఆర్ఎస్ఎస్ మనకు సూచించిన మార్గం స్పష్టమైంది అన్నారు సమాజ స్థాపన పరివర్తన ధర్మం ఐక్యత దేశభక్తి ఆధారంగా జరగాలని ఆయన వ్యక్తం చేశారు ఈ మహత్తర యజ్ఞాన్ని ప్రతి విహెచ్పి కార్యకర్త తమ వ్యక్తిగత కర్తవ్యం గా స్వీకరించాలని కృష్ణ కోరారు సమాజంలో చైతన్యం కలిగించి ధార్మిక బలం పెంపొందించడానికి మనం ఈ ఐదు విలువలను ఆచరించి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు వాటిలో సామాజిక సమరసత, కుల, మత,వర్గ మేధాలను తొలగించి మనమంతా భారతమాత బిడ్డలమే అనే భావనను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు కుటుంబ ప్రబోధన్ లో భాగంగా కుటుంబ బంధాలను బలపరిచి పిల్లలకు భారతీయ జీవన విలువలను నేర్పించాలని తద్వారా సమ సమాజ స్థాపన సాధనకు కృషి చేయాలన్నారు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటాలని ప్రకృతిని కాపాడాలని ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించాలన్నారు ఇలా చేయడం వలన భవిష్యత్ తరాలకు మనం ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించిన వారం అవుతున్నారు భాష వేషధారణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాతృభాష మాతృదేశం భారతీయ సంస్కృతిని గౌరవించేలా సమాజాన్ని చైతన్యవంతం చేయాలన్నారు పౌర నియమాల్లో భాగంగా క్రమశిక్షణతో ప్రవర్తించాలని ప్రభుత్వ నియమాలు గౌరవిస్తూ మంచి పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలి ప్రతి విహెచ్పి కార్యకర్త తన పరిసరాలలో దేవాలయాల్లో పట్టణ గ్రామాలలో పాఠశాలలో ఈ విలువలను పెంపొందించాలని మన ప్రవర్తన మనసేవ మన సమర్పణ భారతమాత పట్ల భక్తిని ప్రతిబింబించేలా ఉండాలన్నారు క్రమశిక్షణ సేవాభావం ధర్మ నిబద్ధతతోనే మనం ఐక్యమైన బలమైన ఆత్మ నిర్భర హిందూ సమాజాన్ని నిర్మించగలమని అప్పుడే భారత్ నిజమైన విశ్వ గురువుగా ప్రపంచానికి మార్గదర్శనం అవుతుందని ఈ మహాక్రతువు లో విహెచ్పి శ్రేణులు అయిన మనమంతా భాగస్వాములై భారతమాత సేవలలో పునీతులమవుదామని కృష్ణాజిల్లా మట్ట మందిర్ సహ ప్రముఖ్ అన్నపరెడ్డి కృష్ణ ఆశా భావాన్ని వ్యక్తం చేశారు.



## మడకలో శ్రీ బోగలింగేశ్వర స్వామి విగ్రహ పునః ప్రతిష్ఠ

**పెడన మేజర్ న్యూస్:** మండల పరిధి మడక గ్రామంలోని శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ బోగలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం విగ్రహ పునః ప్రతిష్ఠా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది అని లలిత ఉపాసకులు బ్రహ్మశ్రీ గుగ్గిలం కన్నయ్య శాస్త్రి తెలిపారు. ఈ మేరకు గత నాలుగేళ్లుగా భూగర్భంలో ఉన్న బ్రహ్మసూత్రం కలిగిన శివలింగాన్ని భూమి నుండి వెలికి తీసి, శాస్త్రోక్తంగా పునః ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నసమారాధన వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ప్రతినెలా మాసశివరాత్రి రోజున అన్నసమారాధనతో పాటు ప్రదోషకాల నందీశ్వర అభిషేకం నిరంతరం నిర్వహించనున్నట్టు తెలిపారు. పశ్చిమ దిక్కున ఉన్న ఈ శివాలయం భక్తులకు ప్రత్యేక ఫలితాలు ప్రసాదిస్తుందని స్థానికుల నమ్మకం అని తెలిపారు.

## సూపర్ సిక్స్ సూపర్ సేవింగ్స్ జీఎస్టీ 2.0 పై ర్యాలీ



**పెడన, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ సూపర్ సేవింగ్స్ జిఎస్టి 2.0 లో భాగంగా శుక్రవారం పట్టణంలో పురపాలక సంఘం పరిధిలో కమర్షియల్ టాక్స్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించిన జీఎస్టీ 2.0 మీద టాయ్స్ అండ్ స్పోర్ట్స్ మెటీరియల్ పై తగ్గుదల అనే అంశం మీద ర్యాలీ నిర్వహించామని పురపాలక సంఘ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు పట్టణంలో పట్టణంలోపురపాలక సంఘం నుంచి గూడూరు రోడ్డు వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ స్టేట్ జిఎస్టి అత్తిలి రంగమణి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్ రెడ్డి జిఎస్టి 2.0 మీద అవగాహన కలిగి ఉండాలని,అలాగే జీఎస్టీ 2.0 లో కేవలం 18%, 5% రెండు స్లాబ్లు మాత్రమే ఉన్నాయని జీఎస్టీ సంస్కరణలు ప్రజలు అవగాహన చేసుకోవాలని తెలియజేశారు.

# స్వర్గీయ మండలి విగ్రహానికి నివాళులర్పించిన మోపిదేవి లంక గ్రామస్తులు



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్థానిక వంతెన సెంటర్లో కృష్ణారావు విగ్రహానికి మోపిదేవి మండలం మోపిదేవి లంక పీఏసీఎస్ చైర్మన్ బళ్లా సీతారామ్ ప్రసాద్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు మురాల సుబ్బారావు, టీసీ డైరెక్టర్ జన్ను వెంకటేశ్వరరావు, గ్రామ కూటమి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. మండలి వెంకటకృష్ణారావు శతజయంతి కమిటీ, గాంధీక్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, మోపిదేవి మండల టీడీపీ, జనసేన, బిజెపి అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, సనక ప్రశాంత్, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, టీడీపీ టౌన్ అధ్యక్షులు అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, దివిసీమ లలిత కళా సమితి కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, పీఏసీఎస్ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, ప్రముఖ న్యాయవాదులు ఆకుల వెంకట్రామయ్య, రామిశెట్టి వేణుగోపాలరావు, బొప్పన వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, టీసీ అధ్యక్షుడు రేపల్లె రవీంద్ర, మాజీ ఎంపీపీ బండే కనకదుర్గ, ఆసుపత్రి డైరెక్టర్ బచ్చు విజయలక్ష్మి, మహిళా నాయకులు విశ్వనాథపల్లి పాప, ఆకుల సీతా మహాలక్ష్మి, కూటమి నాయకులు అన్నపరెడ్డి వెంకటస్వామి, గుగ్గిలం శ్యాంకుమార్, అన్నపరెడ్డి రామదాసు, మండలి రామ్మోహనరావు, గరికపాటి శ్రీనివాసరావు, బడే సుబ్బారావు, కొట్టె విజయ్, దేగల రాఘవ, దేగల రాఘవ, మొగల్ మురాద్, లుక్కా వెంకట పిచ్చియ్య, అడపా శ్రీను, బాలు శ్రీనివాస్, కంచర్ల ఆనంద్, బచ్చు ఆదినారాయణ, మోపిదేవి లంక నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, ఉప్పల వెంకటేశ్వరరావు, ఆర్.నరసారావు, ఎం.శ్రీనివాసరావు, జి.రాజేష్, ఉప్పల శ్రీను బాబు, ఎన్.శివయ్య, ఆర్.శ్రీనివాసరావు, వి.సముద్రాలు, నల్లూరి రాంబాబు, నాగం రాంబాబు, బుల్లా హరీష్, ఆరేపల్లి ప్రవీణ్ భార్గవ, ఏ.రాము తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత స్థాయి సైంటిస్ట్ దువ్వూరి శేషగిరి ఎస్.ఆర్.జి.ఈ.సి. సందర్శన





**గుడ్లవల్లేరు అక్టోబరు 17 మేజర్ న్యూస్:** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజి ను నేటి ఉదయం నేవల్ ఫిజికల్ అండ్ ఓషనోగ్రఫీ లేబరేటరీ, డి.ఆర్.డి.ఓ.,కొచ్చి నుండి ఆ సంస్థ ఉన్నత స్థాయి శాస్త్రవేత్త (సైంటిస్ట్–హెచ్) దువ్వూరి శేషగిరి సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో 'ఎయిర్ డిటెక్షన్ రాడార్– ఇండియన్ పర్స్పెక్టివ్' (గగన లక్ష్యాలను గుర్తించే రాడార్–భారత దృక్కోణం) అను అంశంపై ప్రముఖ శాస్త్రవేత్త దువ్వూరి శేషగిరి విద్యార్థులను, అధ్యాపకులను ఉద్దేశించి నిపుణుల ప్రసంగం చేశారు. ఎయిర్ ఇంటర్సెప్ట్ రాడార్ యొక్క సాంకేతిక పరిజ్ఞానం దాని అభివృద్ధి భారత వాయుసేనలో దాని ప్రాధాన్యతను విశదీకరించారు రాడార్ సాంకేతికతలోని సిగ్నల్ ప్రాసెసింగ్ ట్రాకింగ్ టార్గెట్ ఐడెంటిఫికేషన్ అంశాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పవర్ పాయింట్ ప్రదర్శన ద్వారా వివరించారు. సమకాలీన యుద్ధాలలో రక్షణ రంగంలో రాడార్ ఒక కీలకమైన ఆయుధం అనీ, భారతదేశం స్వదేశీ పరిశోధన అభివృద్ధి ద్వారా రాడార్ సాంకేతికతలో ఆత్మ నిర్భరత సాధించడం అత్యవసరమని దువ్వూరి శేషగిరి పేర్కొన్నారు. రక్షణ రంగంలో ఇంజనీర్ల పాత్ర కీలకమని తదనుగుణంగా విద్యార్థులు పరిశోధన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలని హితవు పలికారు. ఇంకా ఇంజనీరింగ్ విద్యార్థులు ఆవిష్కరణలు, పరిశోధన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని రక్షణ రంగంలో సాంకేతిక పరిశోధనకు కొత్త తరం ఇంజనీర్ల పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఆయన సూచించారు. చివరగా విద్యార్థులతో జరిగిన ఇంట్రాక్షన్ స్పెషల్ లో విద్యార్థుల సందేహాలను సందేశాత్మకంగా తగిన సాంకేతిక పరమైన ఉదాహరణలతో నివృత్తి చేశారు. అనంతరం శాస్త్రవేత్త (సైంటిస్ట్–హెచ్) దువ్వూరి శేషగిరి ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు లు దుశ్శాలువ, జ్ఞాపిక తో గౌరవసత్కారం చేశారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ అధ్యక్షతన ప్రముఖ ఉన్నత స్థాయి శాస్త్రవేత్త దువ్వూరి శేషగిరి తో జరిగిన ముఖాముఖి చర్చ సమావేశంలో డైరెక్టర్స్, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

రాడార్ సాంకేతికత, సిగ్నల్ ప్రోసెసింగ్, కమ్యూనికేషన్ వంటి విషయాలను ఇంజనీరింగ్ పాఠ్యాంశాల్లో మరింత అనుసంధానం చేయడం, రక్షణ పరిశోధన, డి.ఆర్.డి.ఓ. వంటి సంస్థలతో సహకార ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించడం, విద్యార్థులు రక్షణ రంగంలోని ప్రయోగశాలలో, పరిశోధనా కేంద్రాల్లో ప్రాక్టికల్ అనుభవం పొందేలా ఇంటర్న్షిప్, శిక్షణ పొందేందుకు చర్యలు తీసుకోవడం, రాడార్ సిగ్నల్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగశాలలను కళాశాల స్థాయిలో బలోపేతం చేయడానికి మార్గదర్శకాలు, రక్షణ రంగంలో ఉద్యోగ అవకాశాలు, రీసెర్చ్ స్కాలర్షిప్స్, విదేశాల్లో ఉన్నత విద్య వంటి అంశాలను చర్చించి తగిన సలహాలు–సూచనలను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్, డైరెక్టర్ పి.సిద్ధయ్య, యాజమాన్య సలహాదారు డాక్టర్ పి.రవీంద్ర బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్. శాస్త్రి,, పి.జి.సి.ఆర్.డి. డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి. ప్రసాద్, ఏ.ఎస్.& ఏ. డైరెక్టర్ డాక్టర్ ఎం.కామరాజు, కన్వీనర్ డాక్టర్ వై.రామకృష్ణ, వివిధ విభాగాధిపతులు, మెంటర్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గంగానమ్మ గుడివద్ద డ్రైనేజిపై ఆర్సీసి తూముల ఏర్పాటు

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు లోని గంగానమ్మ గుడికి వెళ్ళే రహదారి ముందట గల మురుగు కాలువలో పాత సిమెంటు తూములు తొలగించి నూతన సిమెంటు తూములను గుడ్లవల్లేరు పంచాయతీ శుక్రవారం ఏర్పాటు చేసింది. గుడ్లవల్లేరు గ్రామ పెద్దలు అవిశ్రాంత కృషిచేసి దాతలు అందచేసిన లక్షలాది రూపాయలు విరాళాలతో గంగానమ్మ గుడి జీర్ణోద్ధారణ చేసారు. గంగానమ్మ గుడికి వెళ్ళే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా గుడ్లవల్లేరు పంచాయతీ కార్యదర్శి ఎజెఎల్ నరసింహారావు నేతృత్వంలో పంచాయతీ శానిటరీ ఇన్స్పెక్టర్ పవన్ కుమార్, మురాల నరేష్, పారిశుధ్య సిబ్బంది నూతన తూములను ఏర్పాటు చేయడం పట్ల గ్రామ పెద్దలు, ప్రజల నుండి అభినందనలు.

## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే ఫ్రైడే నిర్వాహనతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం దేవినేని గాంధీ పురం, శాంతి నగర్ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు విఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా ఆంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బయోలజీస్ట్ కామేశ్వరరావు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పేదలకు సేవచేయడం అభినందనీయమని సర్పంచ్ అడపా అంజిబాబు అన్నారు. బాపులపాడు మండలం ఎస్.ఎన్.పాలెం గ్రామంలోని సచివాలయ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తితో కలిసి ఆయన ప్రారంభించారు. డాక్టర్ సుధ(ఈఎన్టీ), డాక్టర్ అభిషేక్(ఆర్థోపెడిక్), డాక్టర్ వినీల (గైనకాలజిస్ట్), డాక్టర్ స్పందన(డెం టల్) ఆధ్వర్యంలో 196 మందికి షుగర్ వ్యాది పరీక్షలు,రక్తపోటు పరీక్షలు, కార్డియాలజీ, డెంటల్ తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితం గా మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహారం వల్ల కలిగే ఉపయోగాలు, వ్యాధి నిరోధకశక్తి గురిం చి డైటీషియన్ హర్ష వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు దోహదపడతాయని సర్పంచ్ అడపా అంజిబాబు తెలిపారు. ఈ వైద్య శిభిరం నిర్వహించటం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అడపా దేవులబాబు, సతీష్, కంపసాటి కొండలరావు, లయన్స్ సభ్యులు చలసాని వెంకటేశ్వరరావు, కలపాల రంగారావు,బోయపాటి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్త వేస్తే జరిమానా



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్యం ఆదేశాలతో రోడ్ల పైన చెత్త వేసిన వారికి, కార్పొరేషన్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రతి శుక్రవారం నిర్వహించే మొబైల్ కోర్టులో 8వ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ గోలీ లెనిన్ బాబు, శుక్రవారం ఉదయం సర్కిల్–3 కార్యాలయం పటమటలో సర్కిల్–3 పరిధిలోని శానిటరీ ఇన్స్పెక్టర్లు నమోదు చేసిన 30 కేసులపై విచారణ జరిపి వారికి రూ.9540లు జరిమానా విధించారు.మరోసారి ఈ విధంగా నిబంధనలకు విరుద్ధంగా చేస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ సందర్భంగా విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం మాట్లాడుతూ, రోడ్లపై మాట్లాడుతూ చెత్త వేసిన మురుగు ప్రవాహానికి అడ్డుపెట్టిన, రోడ్డుపైన పెంపుడు జంతువుల్ని ఉంచినా, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై మొబైల్ కోర్ట్ చర్యలు తీసుకుంటుందని నగర ప్రజలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎం ఓ హెచ్ 3 డాక్టర్ గోపాల్ నాయక్, శానిటరీ సూపర్వైజర్స్ బాలాజీ శ్రీనివాస మూర్తి, సర్కిల్ –3 సంబంధించిన సానిటరీ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## దాతృత్వం చాటుకున్న శ్రీరాంపురం పిఎసిఎస్ అధ్యక్షులు



**రెడ్డిగూడెం, అక్టోబర్ 17, మేజర్ న్యూస్:** మండలం పరిధిలో గల శ్రీరాంపురం గ్రామానికి పంచాయితీ కార్యాలయం కొరకు ఐదు లక్షలు రూపాయలు విలువ చేసే 7 సెంట్ల స్థలాన్ని నాదెళ్ల భాస్కరరావు కుమారుడు, శ్రీరాంపురం సొసైటీ అధ్యక్షులు నాదెళ్ల చెన్నకేశవరావు (కేసిబాబు),, శ్రీరాంపురం గ్రామ సర్పంచ్ అట్లూరి శ్రీనివాసరావు తమ సొంత డబ్బులతో పంచాయతీ కార్యాలయానికి స్థలాన్ని కొనడం జరిగిందని తెలిపారు. గత కొన్ని సంవత్సరాల కాలం నుంచి శ్రీరాంపురంలో పంచాయితీ ఆఫీస్ లేనందున ఆ గ్రామ సంక్షేమం కొరకు అభివృద్ధి కొరకు కూర్చొని చర్చించుకునే వీలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని మన శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది, ఆయన వెంటనే పెద్ద మనసుతో స్పందించి, మీరు స్థలాన్ని కేటాయించుకోండి పంచాయతీ ఆఫీస్ భవన నిర్మాణాన్ని కావలసిన నిధులను మంజూరు చేయించె విధంగా నేను కృషి చేస్తానని ఆయన అన్నారని తెలిపారు. వెంటనే 7 సెంట్లు స్థలాన్ని కొని, రిజిస్ట్రేషన్ చేయించి, రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలను రెడ్డిగూడెం మండల అభివృద్ధి అధికారి టికెవి రమణ, శ్రీరాంపురం సెక్రెటరీ రాజేష్ కి అందజేశారని తెలిపారు. శ్రీరాంపురం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ కు, స్థలాన్ని కొని ఇచ్చిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## విత్తన శుద్ధి పై రైతులకు అవగాహన



**ఘంటసాల, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల ప్రాంగణంలో కేవీకే శాస్త్రవేత్తల బృందం డా. యం.వెంకట లక్ష్మి, డా.కే.రేవతి జీవన ఎరువుల అవగాహన వారోత్సవాలు శుక్రవారంతో ముగిసినవి. జీవన ఎరువులు వినియోగించు విధానాన్నీ నైపుణ్యత ప్రదర్శన ద్వారా విత్తన శుద్ధి పై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. సస్యపోక్షణ శాస్త్రవేత్త డా. వెంకట లక్ష్మి మాట్లాడుతూ జీవన ఎరువులు వివిధ పంటలలో తక్కువ ఖర్చుతో వరి, మినుము, కూరగాయ మొక్కలకు, ఇతర పంటలకు వినియోగించుకోవచ్చుని, తద్వారా నేలలో సుష్మజీవుల సంఖ్య పెరుగుతాయన్నారు. నేలలో ఉన్న పోషకాలు కరిగి మొక్కలకు పోషకాలు అందించడం భూమి సారవంతం పెరగడం జరుగుతుందన్నారు. కేవికే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## సీపీఆర్పై అవగాహన కలిగి ఉండాలి

**అయుష్ డాక్టర్ వాహిని**



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** సీపీఆర్ పై ప్రజలకు అవగాహన ఉంటే గుండెపోటు నుంచి బయటపడొచ్చని అయుష్ డాక్టర్ వాహిని అన్నారు. బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలోని హైస్కూల్లో విద్యార్థులకు శుక్రవారం సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా స్పృహతప్పి పడిపోయి శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది పడుతుంటే సీపీఆర్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరిస్తూ సీపీఆర్ చేసే విధానాన్ని సోదాహరణంగా వివరించారు.గుండెపోటు వచ్చిన రోగికి మొదటి కొన్ని నిమిషాల్లోనే సీపీఆర్ అందిం చడం ద్వారా జీవించే అవకాశాలు రెండింతల నుంచి మూడింతల వరకు ఉంటుందని డాక్టర్ వాహిని తెలిపారు. గుండెపోటుకు గురైన వ్యక్తిని రక్షించేందుకు సీపీఆర్(కార్డియో పల్మనరీ రీసోసియేషన్) గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని విద్యార్థులతో సీపీఆర్ చేయించి చూపించారు. సీపీఆర్ విధానం వల్ల గుండె, ఊపిరితిత్తుల మధ్యలో రక్తప్రసరణ మెరుగుపరచేందుకు, మెదడుకు రక్తప్రసరణ సాఫీగా జరిగేలా దోహద పడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంఎలెచ్పి నాజ్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శ్రీ కనకదుర్గా ఆలయానికి దివ్యాభరణాలను అందజేసిన కీర్తిలాల్స్






**విజయవాడ మేజర్ న్యూస్ :** భారతదేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక వజ్రాలు, బంగారు ఆభరణాల బ్రాండ్లలో ఒకటైన కీర్తిలాల్స్ వజ్రాలతో రూపొందించిన ఆభరణాలను శ్రీ కనకదుర్గా దేవికి సమర్పించింది. ఈ సందర్భంగా కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ మాట్లాడుతూ తిరుమాంగల్యం, చెవిపోగులు, బుల్లాకు, ముక్కుపుడక, పొట్టు, చంద్రచక్రం, సూర్యచక్రాలతో కూడిన ఈ దివ్యాభరణాలను కీర్తిలాల్స్ యొక్క అత్యాధునిక తయారీ కేంద్రంలో నైపుణ్యంతో కూడిన హస్తకళాకారులు నిశితంగా రూపొందించి, అందజేసినట్టు చెప్పారు. అత్యాధునిక సాంకేతికత సాంప్రదాయ ఆభరణ తయారీ కళతో ఇది మిళితమవుతుందన్నారు. ప్రతి ఆభరణం పురాతన పద్ధతులు, ఆధునిక ఆవిష్కరణలు సమన్వయంతో. దైవిక సౌందర్యం, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉట్టి పడేట్టుగా అద్భుత ఆభరణాలు రూపుదిద్దుకున్నాయన్నారు. అధిక నాణ్యత గల సహజ వజ్రాలు, విలువైన రత్నాలతో అలంకరించబడిన ఈ ఆభరణాలు భక్తి, కళాత్మకత, హస్తకళ శ్రేష్టత యొక్క సమపాళ్ల ప్రతిరూపంగా నిలుస్తున్నాయన్నారు. మాణిక్యాలు, వజ్రాలతో అలంకరించబడిన సూర్యచక్రం బలం, ప్రకాశాన్ని ప్రతిబించిస్తుండగా, సహజ ముత్యాలతో రూపొందించబడిన చంద్ర చక్రం నిర్మలమైన దైవత్వాన్ని సూచిస్తుందని, వజ్రాలతో నిండిన అన్ని పాక్షి, చక్ర నమూనాలతో చెవిపోగులు శిల్పకళా చాతుర్యాన్ని, నాగ యొక్క స్వజనాత్మకతను ప్రతిఫలింపజేస్తాయన్నారు. పగడాలు, కెంపులు, పచ్చలు, వజ్రాలతో అలంకరించిన తిరుమాంగల్యం భక్తి, ఐశ్వర్యం, అదృష్టానికి ప్రతీకగా నిలుస్తుంది. అర్ధ చంద్రుని ఆకారాన్ని ప్రేరణగా తీసుకుని, మాణిక్యాలు, వజ్రాలతో రూపొందించిన పొట్టు ప్రశాంతత, దైవిక ప్రకాశాన్ని ప్రసరిస్తుంది. ఓం, త్రిశూల రూపకల్పనతో ఉన్న ముక్కుపుడక ఆధ్యాత్మిక శక్తిని సూచిస్తుండగా, సొగసైన వేలాడే బిందువులతో తీర్చిదిద్దిన బుల్లాకు సంప్రదాయ బంగారు హస్తకళ యొక్క సున్నితమైన నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. "శ్రీ కనకదుర్గా దేవి కోసం ఆభరణాలను సృష్టించడం, అలంకరించడం మాకు చాలా గౌరవంగా ఉందని, దీనికి తాము హృదయపూర్వక కృతజ్ఞతలు, భక్తిని వ్యక్తం చేస్తున్నామన్నారు. 1939లో స్థాపించబడిన కీర్తిలాల్ కాళిదాస్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్, విశ్వాసం, నాణ్యత, శ్రేష్టతకు ప్రతీకగా దక్షిణ భారత దేశంలో ప్రత్యేక స్థానం సంపాదించిందని, ప్రస్తుతం దక్షిణ భారతదేశం అంతటా 15 ప్రత్యేక కీర్తిలాల్స్ షోరూమ్లు, అమెరికా యునైటెడ్ స్టేట్స్ లోని న్యూ జెర్సీలో ఒక అంతర్జాతీయ షోరూమ్ ద్వారా తన వారసత్వాన్ని కొనసాగిస్తోందన్నారు. సంస్థ యొక్క సమకాలీన బ్రాండ్ 'గ్లో బై కీర్తిలాల్స్' కూడా దక్షిణ భారతదేశంలో 8 ప్రత్యేక షోరూమలతో ఈ ఉనికిని విస్తరించింది, దీనితో కీర్తిలాల్స్ మొత్తం 24 షోరూమ్లు మైలురాయిని చేరుకుందని చెప్పారు.

# డెమొక్రటిక్ పిఆర్టియు ఆధ్వర్యంలో మండలానికి నాలుగు బెస్ట్ ఎన్రోల్మెంట్ అవార్డ్స్

**వత్సవాయి, అక్టోబర్ 17, మేజర్ న్యూస్ :** మండలంలో బెస్ట్ ఎన్రోల్మెంట్ అవార్డ్స్ కింద నాలుగు పాఠశాలకు బెస్ట్ ఎన్రోల్మెంట్ అవార్డ్స్ ను రాష్ట్ర అధ్యక్షుడు డి శ్రీను చేతుల మీదుగా ప్రధానం చేయడం జరిగింది. సభ్యత్వ నమోదులో భాగంగా డిపిఆర్టియు రాష్ట్ర సెక్రటరీ మల్లేశ్వరరావు, రాష్ట్ర సేవా అధ్యక్షులు అర్చన శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు నాగరాజు ప్రధాన కార్యదర్శి సుందరరావు పాఠశాలలను సందర్శించారు. బెస్ట్ ఎన్రోల్మెంట్ పాఠశాలలుగా ఎంపికైనటువంటి ఎంపీపీ ఎస్ మక్కపేట, ఎంపీపీ ఎస్ భీమవరం, ఎంపీపీఎస్ వత్సవాయి, మెయిన్ ఎంపీపీఎస్ పోలంపల్లి పాఠశాలలకు, పాఠశాలలోని ఉపాధ్యాయ ఉపాధ్యాయులందరికీ కూడా మెమొంటోస్, శాలువాలతో సత్కరించి మెడల్స్ ను రాష్ట్ర అధ్యక్షులు చేతులు మీదగా అందజేయడం జరిగింది. ముఖ్య అతిథి మండల విద్యాశాఖ అధికారి ఎల్ నాగరాజు ఈ సందర్బంగా మాట్లాడుతూ డెమొక్రటిక్ పిఆర్టియు చేస్తున్నటువంటి ఇటువంటి కార్యక్రమాలు చాలా అభినందనీయమని కొనియాడారు. డి శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఎన్రోల్మెంట్ సాధించి మండలంలోని బెస్ట్ స్కూల్స్ గా నిలిచినటువంటి ఇటువంటి పాఠశాలను ఆదర్శంగా తీసుకొని మిగిలిన పాఠశాలలో కూడా ఎన్రోల్మెంట్ పెంచడంలో తమ వంతు కృషి చేయాలని సూచించారు. డెమొక్రటిక్ పిఆర్టియు ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు జాతీయ సేవాదళ్ కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది.




వత్సవాయి మండలంలో నూతనంగా వచ్చినటువంటి ఉపాధ్యాయులందరికీ కూడా స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేసి వారందరికీ కూడా శాలవాలతో సత్కరించి వాళ్లకి సర్టిఫికెట్స్ ప్రధానం చేయడం జరిగింది. వత్సవాయి మండలంలో వివిధ పాఠశాలలో పనిచేస్తున్న నూతన ఉపాధ్యాయులందరికీ కూడా ఆయన అభినందనలు తెలియజేయడం జరిగింది. రాబోయే రోజుల్లో కూడా ఇటువంటి వినూత్న కార్యక్రమాలు చేయడంలో డెమొక్రటిక్ పిఆర్టియు ఎప్పుడు ముందుంటుందని ఆయన తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల డిపిఆర్టియు అధ్యక్షులు జక్క రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి షేక్ జాను, మండల గౌరవ అధ్యక్షులు ఎస్ కిరణ్ కుమార్ తదితర డిపిఆర్టియు నాయకులు పాల్గొన్నారు.

# బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలి

**చల్లపల్లి మేజర్ న్యూస్:** బాలికలు సమాజంలో పరిస్థితులను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం చల్లపల్లి గురుకుల పాఠశాలలో జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకొని ఐక్యరాజ్యసమితి ఇచ్చిన నినాదానికి అనుగుణంగా బాలికలు, యువతులు, మహిళలు పరిస్థితులను ఎదుర్కొంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రధానంగా రక్తహీనత, బాల్య వివాహాలు, ఆరోగ్య జీవనం, విద్య అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయని తెలిపారు. పూర్వం భారతీయ సంస్కృతిలో స్త్రీలకు అత్యున్నత ప్రాధాన్యత ఉండేదని, అనంతరం స్త్రీని వంటింటికే పరిమితం చేసే ఆలోచన ధోరణి ప్రబలిందన్నారు. ఈ నేపథ్యంలో మొదలైన బాల్య వివాహాలు, సతీసహగమనం, వృద్ధులకు యువతులతో వివాహాలు చేసే సామాజిక దురాచారాల నిర్మూలనకు విప్లవాత్మక సంఘసంస్కర్తలు రాజా రామ్మోహన్ రాయ్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు సాగించిన పోరాటం మరువలేనిదన్నారు. భారత స్వతంత్ర పోరాటంలో మహిళలకు స్వాగతం పలికి వారిని అద్వితీయ పోరాట ధీరులుగా ప్రోత్సహించిన మహాత్మా గాంధీ ప్రభావంతో మహిళలు రాజకీయంగాను ధైర్యంగా బయటకు వచ్చే పరిస్థితి వచ్చిందన్నారు. సరోజినీ నాయుడు, దుర్గాబాయి దేశ్ ముఖ్, ఝాన్సీ లక్ష్మీబాయి, కస్తూరిబా గాంధీ, కమల నెహ్రూ, ఇందిరా గాంధీ ఇంకా మరెందరో వీర నారీమణులు దేశ స్వతంత్రం కోసం పోరాటం చేశారన్నారు. ప్రపంచ దేశాలను గడగడలాడించిన ఐరన్ లేడీ ప్రధాని ఇందిరా గాంధీ, ఎవరికి



తలవంచని దృఢచిత్తంతో ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన జయలలిత, మమతా బెనర్జీ స్ఫూర్తిప్రదాతలుగా నిలిచారన్నారు. బాలికలు అనేక రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.రాణి, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ ఏపీ మిషన్ డైరెక్టర్ బోలెం నాగమణి, సీఐ కే.ఈశ్వరరావు, ట్రైని ఎస్ఐ కే.శ్రీలత, ఎంఈఓ పీ.వెంకటేశ్వరరావు, గురుకుల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పైడిపాముల అరుణకుమారి, మొవ్వ సీడీపీఓ ఎస్.ప్రసన్న విశ్వనాథన్, చల్లపల్లి, ఘంటసాల మండలాల సూపర్ వైజర్లు డీసీపీయూ సిబ్బంది, గురుకుల అధ్యాపకులు, ఉపాధ్యాయినిలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించి పలువురు ఉద్యోగుల నుండి స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఉద్యోగులు విన్నవించిన వివిధ సమస్యలను ఆయన ఓపిగ్గా ఆలకించి పరిష్కారంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మొత్తం 5 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని వాటిని సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మూలపాడు టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా నాగేశ్వరావు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు తెలుగుదేశం గ్రామ పార్టీ అధ్యక్షులుగా మైలవరం నియోజకవర్గం శాసనసభ్యులు వసంత వెంకట క్రిష్ణ ప్రసాద్ ఆశీస్సులతో మూ లపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన మూరకొండ నాగేశ్వరరావు కి ఎమ్మెల్యే వసంత శుభాకాంక్షలు తెలియజేశారు. నాగేశ్వరావు మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి కారుకులైన శాసనసభ్యులు కృష్ణ ప్రసాద్‌కి తన సహోదరులు కూటమి నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఈ పదవి అప్పగించినందుకు పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయం ముందు ఎంఆర్పిఎస్ నిరసన



**రెడ్డిగూడెం, అక్టోబర్ 17, మేజర్ న్యూస్ :** రెడ్డిగూడెం ప్రధాన కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి. ఆర్ గవాయ్ పై జరిగిన దాడినీ ఖండించారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను చెప్పుకునే అవకాశం కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అత్యున్నత పదవులలో ఉన్న వారికే ఇలాంటి అవమానాలు జరిగితే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. బి.ఆర్ గవాయిపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిషోర్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మండూరి నాగేశ్వరరావు, మాధంగి రామారావు, చాట్ల బాబురావు, మల్లాది చిన్న లాజర్, మారెపోగు విజయకుమార్, చింతిరాల కిషోర్,, మల్లాది జగదీష్, జుంజునూరి రాజా, కంచర్ల చంద్రరావు, కట్ట జమలయ్య, సగ్గుర్తి దుర్గారావు, పులిపాక ఆనంద్ కుమార్, పల్లె పాము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999